సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం। 5। సెప్టెంబర్। 2023



అభివృద్ధికి కేరాఫ్ బీఆర్ఎస్ సర్కార్
బీఆర్ఎస్ సర్కార్ అభివృద్ధికి కేరాఫ్ అని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే ఫైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 8లో




అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం
అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యగా బీఆర్ఎస్ పాలన సాగిస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. - 9లో



బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు
రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హెచ్చరించారు. - 10లో

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా.. మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను మాకు పంపండి. 7వ తేదీ సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయసు పది సంవత్సరాల లోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పనిసరిగా పేర్కొనాలి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నెంబర్
80962 93702

లిస్ట్‌లో పేరుందా..!

నేడోరేపో ఖరారు కానున్న కాంగ్రెస్ అభ్యర్థులు

- స్క్రీనింగ్ కమిటీ చేతికి జాబితా
- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- టికెట్ కోసం గాడ్‌ఫాదర్‌ల చుట్టూ ప్రదక్షిణలు



సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక కీలక దశకు చేరుకోవడంతో జిల్లాలోని దరఖాస్తు దారుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మంగళ, బుధవారాల్లో జరగనున్న స్క్రీనింగ్ కమిటీ సభ్యుల పరిశీలనలో అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరనుంది. ఎంపిక చేసిన దరఖాస్తుదారుల పేర్లను స్క్రీనింగ్ కమిటీ ఏఐసీసీకి సీల్డ్ కవర్‌లో పంపనుంది. జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోనన్న టెన్షన్ దరఖాస్తుదారుల్లో నెలకొంది. ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆదివారం పరిశీలించి షార్ట్ లిస్ట్‌ను ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సోమవారం స్క్రీనింగ్ కమిటీకి అందజేసింది.

స్క్రీనింగ్ కమిటీకి సిఫార్సు

పార్టీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులపై ఇప్పటికే వడపోత ప్రారంభమైంది. భువనగిరిలో 11, ఆలేరులో 17, తుంగతుర్తిలో 23, నకిరేకల్ లో 18, మునుగోడులో నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నియోజకవర్గాలన్నీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకే వస్తాయి. పార్లమెంట్ పరిధిలో రెండు స్థానాలను బీసీలకుఇవ్వాలన్న అధిష్టానం ప్రతిపాదన నేపథ్యంలో భువనగిరి, ఆలేరులో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. తుంగతుర్తి, నకిరేకల్ ఎస్సీ రిజర్వుడు కాగా, జనరల్‌లోకి ఆలేరు, భువనగిరి, మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఆదివారం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు మూడు, నాలుగు పేర్లను స్క్రీనింగ్ కమిటీకి సిఫార్సు చేశారు.

భువనగిరిలో నలుగురి పేర్లు

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి దరఖాస్తు చేసుకున్న 11 మంది జాబితాలో వడపోత అనంతరం నలుగురి పేర్లు ప్రతిపాదించినట్లు సమాచారం. బీసీల జాబితాలో మూడు పేర్లు, ఓసీ జాబితాలో ఒక పేరు స్క్రీనింగ్ కమిటీకి సిఫార్సు చేసినట్లు సమాచారం. అయితే, బీఆర్ఎస్ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనే అభ్యర్థి ఎవరనేదానిపై అధిష్టానం చర్చిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారితోపాటు మరికొందరు పార్టీలోకి వచ్చే అవకాశాలు ఉన్నందున పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోందని పార్టీ నాయకులు అంటున్నారు.

టికెట్ కోసం ప్రయత్నాలు

పీసీసీ అభ్యర్థుల ఎంపిక వడపోత, మంగళవారం జరుగనున్న స్క్రీనింగ్ కమిటీ సమావేశం నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తమకు టికెట్ ఇప్పించాలని గాడ్ ఫాదర్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. టికెట్ల కేటాయింపు తుది దశకు చేరుకుంటున్న సమయంలో సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

ఆలేరులో నాలుగు పేర్లు సిఫార్సు

ఆలేరు నియోజకవర్గంలోనూ టికెట్ కోసం ఆశావహులు 17 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇక్కడ ముందు నుంచి బీసీలకు టికెట్ వస్తుందన్న ప్రచారం ఉంది. దీంతో బీసీలు, ఓసీలు, ఎస్సీలు, ఎస్టీ, మహిళలు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పీసీసీ మాత్రం బీసీకే ప్రాధాన్యం ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అయితే పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థుల జాబితాను పరిశీలించి రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఓసీ, ఎస్సీ దరఖాస్తుదారుల పేర్లను కూడా పరిగణనలోకి తీసుకుని స్క్రీనింగ్ కమిటీకి పంపించారు.

భువనగిరిలో మాతం ప్రదర్శన



మాతం ప్రదర్శన నిర్వహిస్తున్న షియా ముస్లింలు

భువనగిరిటౌన్ : ప్రవక్త మహమ్మద్ (స.అ) మనువడు ఇమాం హుస్సేన్ (అ.స) బలిదానాన్ని స్మరిస్తూ అర్బయీన్‌ను పురస్కరించుకుని సోమవారం భువనగిరిలో షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో మాతం ప్రదర్శన ర్వహించారు. ఖాజీ మోహల్లా బీబీకా అలావా పీర్ల చావడి నుంచి మహమ్మద్ ఖుర్షీద్ అలీ నివాసం వరకు ప్రదర్శన కొనసాగింది. షియా ముస్లింలు విషాద గీతాలు ఆలపించారు. మత పెద్ద అబ్బాస్ నఖ్వీ ధార్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో షియా ముస్లిం సంఘం అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కల్బే హుస్సేన్, ప్రతినిధులు లాయక్ అలీ, మహేది హుస్సేన్, హైదర్ అలీ, తఖీ హుస్సేన్, సజ్జాద్, అస్గర్, అద్నాన్ రజా, బాసిత్ అలీ, ఆఘా మహెది పాల్గొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. సంబంధిత శాఖలు తమ పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. మొత్తం 11 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ సమస్యలకు సంబంధంచి 10 ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, డీఆర్ఓ పద్మజారాణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస రాజుతో పాటు పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి

భువనగిరి : లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి అన్నారు. ఈ నెల 9న జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 6,705 కేసులను గుర్తించామని, ఇందులో సివిల్, క్రిమినల్ 6,293, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 412 కేసులు ఉన్నట్లు చెప్పారు.జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారికి నిత్య కైంకర్యాలు చేపట్టిన అనంతరం నిత్య రుద్రహవనం గావించారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు చేశారు. ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. యాదాద్రీశుడి ప్రధానాలయంలోనూ స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయపూజలు కొనసాగాయి.

సైనిక్ కళాశాల విద్యార్థినులకు మెడల్స్



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థినులు

బీబీనగర్: మండలంలోని గురుకుల మహిళా సైనిక్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు అమూల్య, సుస్మితలు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఝూర్ఖండ్‌లో జరుగుతున్న 43వ టైక్వాండో జాతీయ చాంపియన్‌షిప్‌లోని 60 కిలోల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కై వసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యాదగిరిగుట్టలో వర్షం

యాదగిరిగుట్ట : పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. దీంతో స్థానిక జనజీవనంతో పాటు యాదాద్రీశుడి దర్శనానికి వచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు. పాతగుట్ట, యాదగిరిపల్లి, బీసీ కాలనీలకు వెళ్లే రహదారులపై ఉన్న గుంతల్లో నీరు నిలువవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 31 మంది

- నేడు కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాలు అందజేత
- హాజరుకానున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భువనగిరి : 2023 సంవత్సరానికి గాను జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 31 మంది ఎంపికయ్యారు. వీరిని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో సన్మానించనున్నారు. మెమెంటో, ప్రశంస పత్రాలు అందజేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నారు.



పేరు	హోదా	పనిచేసే ప్రదేశం
ఎం.సుమిత్ర	జీహెచ్‌ఎం	జెడ్పీ హెచ్‌ఎస్(బీ).నారాయణపురం
కె.ఉషారాణి	జీహెచ్‌ఎం	జెడ్పీహెచ్‌ఎస్. పుట్టపాక
కె.బాలలక్ష్మి	ఎస్‌ఏ (తెలుగు)	జెడ్పీహెచ్‌ఎస్ దాతర్‌పల్లి
బి.ప్రభాకర్‌రెడ్డి	ఎస్‌ఏ (ఇంగ్లీష్)	జెడ్పీహెచ్‌ఎస్. మోటకొండూర్
కె.శ్రీధర్	ఎస్‌ఏ (గణితం)	జీయూపీఎస్– 2.భువనగిరి
పి.యాదగిరి	ఎస్‌ఏ (పీఎస్)	జెడ్పీహెచ్‌ఎస్. వెల్మజాల
కె.రామకృష్ణారెడ్డి	టీఎస్‌ఏ (పీఎస్)	జెడ్పీహెచ్‌ఎస్.అనంతారం
ఎం.రవికుమార్	ఎస్‌ఏ (బయో)	జెడ్పీహెచ్‌ఎస్. టంగుటూరు
అయేషా సుల్తానా	ఎస్‌ఏ (బయో)	జీహెచ్‌ఎస్ (జేఆర్‌సీ). భువనగిరి
పి.విజయ	ఎస్‌ఏ (ఎస్‌ఎస్)	జెడ్పీహెచ్‌ఎస్. పుట్టపాక
బి.భాగ్యశ్రీ	ఎస్‌ఏ (ఎస్‌ఎస్)	ఎస్‌బీ జెడ్పీహెచ్‌ఎస్. వలిగొండ
కె.నవీన్‌కుమార్	పీజీటీ	టీఎస్‌ఎంటీ. బొమ్మలరామారం
కె.రవికాంత్	ఎస్‌జీటీ	ఎంపీయూపీఎస్. ముక్తాపూర్
బి.కరుణాకర్	ఎస్‌జీటీ	ఎంపీయూపీఎస్. మొరిపిరాల
ఎస్.రమేష్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. వెల్వర్తి
వై.కమలాకర్‌రెడ్డి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. పీపల్‌పహాడ్
ఏ.వెంకటేశ్వర్లు	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్ గద్దరాళ్లతండా
టి.మల్లారెడ్డి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. ఇస్కిళ్ల
వై.వెంకటనర్సింహారెడ్డి	ఎస్‌జీటీ	ఎంపీయూపీఎస్. సుంకిశాల
ఏ.ఆదిలక్ష్మి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. రామలింగంపల్లి
జె.రామచంద్రు	ఎస్‌జీటీ	ఎంపీయూపీఎస్. చీమలకొండూరు
కె.ధనలక్ష్మి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. జియాపల్లి
ఎస్.శ్రీదేవి	ఎస్‌జీటీ	ఎంపీయూపీఎస్.రాయరావుపేట
ఆర్.లక్ష్మారెడ్డి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. పెద్ద పర్వతాపూర్
ఎస్.భూపాల్‌రెడ్డి	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. జైకేసారం
బి.యాదయ్య	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ). కనకండ్లగూడెం
సీహెచ్.చిత్తరంజన్	ఎస్‌జీటీ	ఎంపీపీఎస్. రాయపల్లి
ఎం.జయశ్రీ	ఎల్‌పీటీ	జెడ్పీహెచ్‌ఎస్. కప్రాయిపల్లి
ఎడీ. జైనలొద్దీన్	ఎల్‌పీహెచ్	జెడ్పీహెచ్‌ఎస్. ముల్కలపల్లి
టి.కోటేశ్వర్‌రావు	పీఈటీ	జెడ్పీహెచ్‌ఎస్. చల్లూరు
బి.శ్రీలత	సీఆర్‌టీ(బయో)	కేజీబీవీ. బొమ్మలరామారం

టెట్‌కు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : టెట్ (టీచర్స్ ఎలిజబులిటీ టెస్ట్)కు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అధికారులతో సమావేశమై టీఆర్‌టీ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల 15వ తేదీన ఉదయం 9.30నుంచి 12 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్–2 ఉంటుందన్నారు. పేపర్–1కు 2,976, పేపర్ –2కు 2,822 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక చికిత్సకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని, వైద్యారోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పొరపాట్లకు తావులేకుండా పరీక్ష సవ్యంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు, ఏసీపీ వెంకట్‌రెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, ఎస్‌డీసీ నాగలక్ష్మి, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌గౌడ్, ట్రాన్స్‌కో ఏడీఈ సత్యప్రకాశ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మంత్రి హరీశ్‌రావు వీడియో కాన్ఫరెన్స్

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌నుంచి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలుపై సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చండూరు.. రెవెన్యూ డివిజన్

ఐదు మండలాలతో ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నెరవేరిన మునుగోడు ఉప ఎన్నిక హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

చండూరు : చండూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైంది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో సీఎం కేసీఆర్ చండూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఐదు మండలాలతో చండూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు.

చండురు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఓటర్లు ఇలా..

మండలం	ఓటర్లు
చండూరు	33,634
మర్రిగూడ	28,305
మునుగోడు	35,509
నాంపల్లి	34,115
గట్టుప్పల్	14,543

ఐదు మండలాలతో..

ఐదు మండలాలతో చండూరును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. నల్లగొండ రెవెన్యూ డివిజన్ నుంచి గట్టుప్పల, మునుగోడు, చండూరు, దేవరకొండ రెవెన్యూ డివిజన్ నుంచి నాంపల్లి, మర్రిగూడ మండలాలను తీసి చండూరు రెవెన్యూ డివిజన్ చేస్తున్నారు. ఆ మండలాల్లో నేటి నుంచి 15 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించనున్నారు.



తగ్గనున్న దూరభారం

చండూరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరభారం తగ్గింది. చండూరు, మునుగోడు మండలాల నుంచి నల్లగొండకు 25 నుంచి 33 కిలో మీటర్ల వరకు ప్రయాణం చేయాల్సి ఉండగా.. నాంపల్లి, మర్రిగూడ మండలాలకు చెందిన ప్రజలు దేవరకొండ డివిజన్ 50 కిలో మీటర్ల వరకు ప్రయాణం ఉంటుంది. ఇక ఆ దూరభారం తగ్గనుంది. మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ మండలాల ప్రజలు ఇక 15 కిలో మీటర్ల ప్రయాణిస్తే చండూరు చేరుకోవచ్చు.

ఆశయం నెరవేరింది

ఉప ఎన్నికలో భాగంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయడం ఆనందంగా ఉంది. మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి ఇచ్చిన హామీలు సైతం అమలు జరుగుతున్నాయి. చండూరు రెవెన్యూ డివిజన్ కావడంతో నా ఆశయం నెరవేరింది.

– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మునుగోడు

పోల్ క్లైంబింగ్ టెస్ట్

భువనగిరి : జూనియర్ లైన్‌మన్(జేఎల్‌ఎం) అభ్యర్థులకు సోమవారం భువనగిరిలోని విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో పోల్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహించారు. 91 పోస్టులకు గాను మొదటి రోజు 92 మందికి 87 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీజీఎం పాండ్యా, నల్లగొండ,యాదాద్రి జిల్లాల ఎస్ఈలు చంద్రమోహన్, శ్రీనాథ్, డీఈలు పాల్గొన్నారు.




పోల్ ఎక్కుతున్న జేఎల్‌ఎం అభ్యర్థులు

రెవెన్యూ ఉద్యోగుల మాయాజాలం

ఇన్‌చార్జి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

- కోట్లు విలువ చేసే భూమి కాజేసే పన్నాగం
- అధికార పార్టీ నేతలతో చేతులు కలిపిన ఉద్యోగులు
- కలెక్టర్ ఆరాతీస్తే అసలు విషయం వెలుగులోకి..

చౌటుప్పల్ : రెవెన్యూ ఉద్యోగులు కాసులకు కక్కుర్తిపడి అక్రమార్కులతో చేతులు కలుపుతున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి.. నిషేధిత జాబితాలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన భూమిని అధికారికంగా రికార్డు మార్చేంచుకు పన్నాగం పన్నారు. ఫోర్జరీ అంశాన్ని కలెక్టర్ గుర్తించి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో ×గోల్డెన్ ఫారెస్టు₹ సంస్థకు వందలాది ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములు సుప్రీంకోర్టు ఆధీనంలోకి వెళ్లడంతో 2000 సంవత్సరంలో అధికారులు నిషేధిత జాబితాలోకి చేర్చారు. సర్వే నెంబర్ 311, 313లలో విజయవాడకు చెందిన ఓ వ్యక్తికి 10.20 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని విక్రయించాలంటే రికార్డు సరిచేయాల్సి ఉంది. కానీ, నిషేధిత జాబితాలో ఉండడంతో గత కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రకరకాల ప్రయత్నాలు చేసినప్పటికీ రికార్డు సరికాలేదు. గత ఏడాది నుంచి ప్రయత్నాలను ముమ్మరం చేశాడు.



రికార్డు కరెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న నిషేధిత జాబితాలో ఉన్న గోల్డెన్ ఫారెస్టు సంస్థ భూమి

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

విజయవాడకు చెందిన సదరు భూమి యజమాని చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓ అధికార పార్టీ మహిళా ప్రజాప్రతినిధి భర్తతో చేతులు కలిపాడు. ఆ క్రమంలో గత ఏడాది అక్టోబర్‌లో భీమయ్య అనే వ్యక్తి పేరిట నకిలీ పత్రాలు సృష్టించి ధరణిలో డాక్యుమెంట్ కరెక్షన్‌కు మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. విచారించిన అధికారులు గోల్డెన్ ఫారెస్టు భూమిగా గుర్తించి దరఖాస్తును అప్పట్లోనే తిరస్కరించారు. ఆ క్రమంలోనే ఈ ఏడాది మే నెలలో రెండు పర్యాయాలు డాక్యుమెంట్ కరెక్షన్‌కు దరఖాస్తు చేశారు. గత నెలలో ఇక్కడి తహసీల్దార్ బదిలీ కావడంతో ఆర్డీవో కార్యాలయ డీఏవోకు ఇంచార్జీ తహసీల్దార్‌గా బాధ్యలు అప్పగించారు. ఆ సమయంలో కూడా ఆ భూమికి సంబంధించిన దరఖాస్తుదారుల అర్జీలను తిరస్కరించిన ఇంచార్జీ తహసీల్దార్.. దానిపై కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అయితే, అక్రమార్కులతో చేతులు కలిపిన కార్యాలయ ఉద్యోగులు రికార్డు కరెక్షన్‌కు సిఫారసు చేస్తూ కలెక్టర్‌కు మరో నివేదిక పంపించినట్టు సమాచారం. ఒకే భూమికి సంబంధించి రెండు వేర్వేరు నివేదికలు ఉండడంతో కలెక్టర్ అనుమానించినట్టు తెలిసింది. దానిపై ఆరాతీయగా ఇన్‌చార్జి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ జరిగినట్టు గుర్తించారు. తక్షణమే ఈ విషయంలో శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్టు సమాచారం. ఇప్పటికే విచారణ ప్రారంభమైనట్లు తెలిసింది.



గోల్డెన్ ఫారెస్టు సంస్థ భూమి ముఖద్వారం

రూ.కోట్ల విలువైన భూమి కోసం..

నిషేధిత జాబితాలోని 10.20 ఎకరాల భూమి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వెంట ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఆ భూమి విలువ రూ.30కోట్ల పైగానే ఉంటుంది. దానిని అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని భావించిన సదరు యజమాని అధికార పార్టీ నాయకుడితో కలిసి రెవెన్యూ ఉద్యోగులను లోబర్చుకున్నాడు. కోట్ల విలువైన భూమిలో వాటా మాట్లాడుకున్న తర్వాతనే సదరు ఉద్యోగులు బరితెగింపుకు పాల్పడినట్టు తెలుస్తోంది. తన పరిధిలో లేని విషయమే అయినప్పటికీ సదరు ఉద్యోగులు ఏకంగా ఇంచార్జీ తహసీల్దార్ సంతకాన్నే ఫోర్జరీ చేశారు. భారీగా రాబడి వస్తుంది కాబట్టే ఇంతటి బరితెగింపుకు పాల్పడినట్టు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

తిరస్కరించిన నివేదికే కలెక్టర్‌కు పంపాం

లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని 311, 313 సర్వే నెంబర్‌లలోని 10.20 ఎకరాల భూమి సంబంధించి రికార్డు కరెక్షన్‌కు దరఖాస్తు వచ్చింది. సదరు భూమి గోల్డెన్ ఫారెస్టు సంస్థ భూమిగా రెవెన్యూ రికార్డుల్లోనే ఉంది. దీంతో సదరు అర్జీలను తిరస్కరిస్తూ సంబంధిత నివేదికను కలెక్టర్‌కు పంపడం జరిగింది. నేను ఇక్కడ విధుల్లో చేరకముందు నివేదిక పంపించారు. ఇంచార్జి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ జరగలేదు. ఇది ప్రచారం మాత్రమే. రికార్డు కరెక్షన్‌కు అనుకూలంగా ఎలాంటి సిఫారసూ వెళ్లలేదు.

– హరికృష్ణ, తహసీల్దార్, చౌటుప్పల్

క్లుప్తంగా

దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా

● పలువురికి గాయాలు



గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హుజూర్‌నగర్: దైవ దర్శనానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పలువురు భక్తులు ఆటోలో సోమవారం కోదాడ మండలంలోని ఎర్రవరం ఉగ్ర బాలనర్సింహస్వామి ఆలయానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హుజూర్‌నగర్ పట్టణ శివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కటారి వీరాంజనేయులు, కటారి లక్ష్మి, నారబోయిన కోటిరత్నంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గాయపడిన వారిని హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకొని వారు నరసరావుపేటకు వెళ్లిపోయారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నూతనకల్: చోరీ కేసులో ఓ వ్యక్తికి తుంగతుర్తి మున్సిఫ్ మెజిస్ట్రేట్ శాలిని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం వెంకెపల్లి గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఇటీవల హుండీ చోరీ చేసిన కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రహ్మకన్నపల్లెకు చెందిన కొమరగిరి యాకూబ్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. అతడు నేరాన్ని అంగీకరించడంతో కేసు నమోదు చేశారు. యాకూబ్‌ను సోమవారం తుంగతుర్తి కోర్టులో హాజరుపర్చగా వివిధ సాక్ష్యాలను పరిశీలించిన మున్సిఫ్ మెజిస్ట్రేట్ శాలిని అతడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్ బీఆర్‌ఎస్ సర్కార్



చిన్న మూసీపై బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ సర్కార్ అంటేనే అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లిలో చిన్నమూసీపై రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి, రూ.12.60 లక్షలతో నిర్మించిన వైకుంఠధామాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే దుర్గాదేవి కళావేదికకు శంకుస్థాపన చేశారు. అనంతరం కనుముకుల గ్రామంలో వైకుంఠధామం ప్రహరీ, కళావేదిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సూచీలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. పిలాయిపల్లి – దేశ్‌ముఖి, రేవనపల్లి – పెద్దరావులపల్లి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు పిలాయిపల్లిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలతమల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీడీఓ బాలశంకర్, పీఆర్ ఏఈ వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ కె.భూపాల్‌రెడ్డి, సర్పంచుల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, సర్పంచులు కంటె రాములుయాదవ్, కోట అంజిరెడ్డి, యాకరి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులు

● బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
● విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



గ్లోబల్ టీచర్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి (ఫైల్)



తూడి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి ఎక్కడ పనిచేసినా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. 2015లో బదిలీపై ఆయన అప్పటికే మూతబడ్డ త్రిపురారం మండలంలోని బాబుసాయిపేట ఎంపీయూపీఎస్ పాఠశాలకు వచ్చారు. ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించి ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి 8 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 80 మందికి పెంచారు. ఆయన ప్రత్యేక చొరవ వల్ల ఆ పాఠశాల ఆదర్శ పాఠశాలగా నిలిచింది. గ్రామపంచాయతీ సహకారంతో ఒక విద్యా వలంటీర్‌ను, ఒక స్కావెంజర్‌ను ఏర్పాటు చేసుకొని ఇంటింటికి తిరిగి బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషిచేశారు. ఇప్పుడు ఆ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో మండల స్థాయిలోనే అత్యుత్తమ మార్కులు సాధించడంతో గురుకుల సీట్లు కూడా సాధించారు. గతంలో ఆయన వేములపల్లి మండలం శెట్టిపాలెంలో పనిచేసినప్పుడు 65 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 108 మంది విద్యార్థులకు పెంచారు. దీంతో ఆ పాఠశాలకు రెండు అదనపు ఉపాధ్యాయుల పోస్టులు, ఒక ఎల్‌ఎఫ్‌ఎల్, హెచ్‌ఎం, ఎస్‌జీటీ పోస్టు మంజూరైంది. అంతకుముందు నిడమనూరు మండలం కుంటిగొర్లగూడెంలో ఐదున్నర సంవత్సరాలు పనిచేశారు. అక్కడ భవనం లేకపోయినప్పటికీ చెట్ల కిందనే విద్యార్థులకు విద్యా బోధన చేసి ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దారు. అదేవిధంగా బాబుసాయిపేట పాఠశాలలో హరితహారం, పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించారు. గ్రామపంచాయతీ సహకారంతో 50 ట్రక్కుల నల్లరేగడి మట్టిని పోయించి 200 మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ప్రతి శనివారం విద్యార్థులతో కలిసి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచి పచ్చదనంగా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు బోధన సులభతరం చేయడం కోసం సొంత ఖర్చులు రూ.30వేలతో గోడలపై బొమ్మలను గీయించారు. సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు అందించారు. సామాజిక సేవ, యోగా, వ్యక్తిత్వ వికాసం, దేశ భక్తి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వెంకట్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆటా టీచర్స్ అవార్డు, జాతీయ విద్యారత్న అవార్డు, జాతీయ పుడమి అవార్డు, తెలంగాణ ప్రతిభరత్న అవార్డు, మదర్ థెరిస్సా ఉత్తమ సేవా పురస్కారం, గతేడాది గ్లోబల్ టీచర్ అవార్డు అందుకున్నారు.

కరోనా సమయంలోనూ కొత్తగా బోధన



కరోనా సమయంలో గోడలపై రాయించి బోధిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మ (ఫైల్)

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన అలుగుబెల్లి పద్మ త్రిపురారం మండలంలోని కంపాసాగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానాపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పుడమి సాహితీ వేదిక వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారం –2023కు ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలలోని విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌లు సలభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులతో కలిసి విద్యా బోధన చేస్తున్నారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించారు. కరోనా కష్టకాలంలో సైతం విద్యార్థులు చదువులో వెనుకబడకుండా వినూత్నంగా ఆలోచించి గ్రామంలోని వాటర్ ట్యాంకులు, పహరీలపై ఇంగ్లిష్ అక్షరాలు, పదాలను బొమ్మల రూపంలో రాయించి బోధించారు. దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడానికి కృషిచేస్తున్నారు. దీంతో గ్రామస్తులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాలనే ఆలోచన చేయకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగిస్తూ విద్యా బోధన చేస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు అలుగుబెల్లి పద్మ పేర్కొన్నారు.

‘డిజిటల్’ టీచర్



వెలిదండ జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు కేవీ సత్యనారాయణ



సత్యనారాయణ

గరిడేపల్లి: మండలంలోని వెలిదండ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేవీ సత్యనారాయణ తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రచయితగా, ఉత్తమ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. గత 28 ఏళ్లుగా గరిడేపల్లి మండలంలోని గారకుంటతండా, రేగులగడ్డతండా, కీతవారిగూడెం, వెలిదండ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తూ పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేసి ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి పాటుపడుతున్నారు. వెలిదండ పాఠశాలలో దాతల సహకారంతో డిజిటల్ తరగతి గదితో పాటు అత్యాధునిక గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయించారు. 5000 గజాల స్థలాన్ని దాతల ద్వారా సమకూర్చారు. ఆయన సహకారంతో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రస్తుతం ప్రసిద్ధ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించి ఉన్నత లక్ష్యాల వైపు పురోగమిస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూ..



పాఠాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయురాలు సుజాత

నడిగూడెం: విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది తగ్గుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి. ఇలాంటి సమయంలో నడిగూడెం మండలంలోని సిరిపురం కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కన్నెగంటి సుజాత గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో నిత్యం చర్చించి విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు. సిరిపురం కాలనీ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో ఓ వైపు విద్యార్థుల సంఖ్య పెంచుతూ, మరోవైపు విద్యార్థులకు దాతల సహకారంతో నోట్‌పుస్తకాలు, దుస్తులు, ఆట వస్తువులు ఇప్పిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

బొమ్మలతో తెలుగు భాష అర్థమయ్యేలా..



బొమ్మలు గీసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు దామోదరాచారి

నాంపల్లి: నాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు దామోదరాచారి తనదైన శైలిలో తెలుగు సబ్జెక్ట్‌ను విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠ్యంశాన్ని బోధించే ముందు దామోదరాచారి అందుకు సంబంధించిన బొమ్మలను బోర్డుపై ఆకర్షణీయంగా గీస్తారు. పాఠాలు వినడంతో పాటు అందుకు సంబంధించిన బొమ్మలను చూడడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశం సులభంగా అర్థమవుతుందనే ఆలోచనతో బోధిదిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు సమాజంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ స్ఫూర్తిని నింపుతున్నారు. దామోదరాచారి గతేడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు.

వినూత్న రీతిలో బోధన



వివిధ పరికరాలతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు బి. రాజేశ్వరీ



బి. రాజేశ్వరీ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బి. రాజేశ్వరీ వినూత్న పద్ధతిలో బోధన చేస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటోంది. పాఠశాలలో గత 12 ఏళ్లుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే విధంగా టాపిక్‌లను అనుగుణంగా స్వయంగా బోధనాభ్యాసన పరికరాలను తయారు చేసి కథల రూపంలో బోధిస్తున్నారు. అవసరాన్ని బట్టి టీవీతో పాటు మొబైల్‌లో లైవ్ వీడియోలను ప్రదర్శిస్తూ పాఠాల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంపొందిస్తున్నారు. పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలే కాకుండా నైతిక విలువల గురించి బోధిస్తున్నారు. ఖాళీ సమయాల్లో పిల్ల ల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించేందుకు యోగా, ధ్యానం నేర్పిస్తున్నారు. అంతేకాక చదువులో పోటీతత్వం పెంచేలా పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సొంతంగా పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు, డిక్షనరీలు, బుక్స్ అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపుతూ..



కొండ్రాపల్లి జనార్దన్



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొండ్రాపల్లి జనార్దన్ (ఫైల్)

నాంపల్లి: విద్యార్థుల భవిష్యత్‌కు దారి చూపుతూ ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేస్తున్నారు మర్రిగూడ మండలంలోని శివన్నగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండ్రాపల్లి జనార్దన్. ఆయన పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేశారు. దాతలు సహకారంతో, ప్రభుత్వం నిధులతో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులకు ఆటపాటలతో పాఠ్యంశాలు అర్థమయ్యేలా బోధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఎందరో పేద విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికను తయారుచేసి గురుకుల, నవోదయ, ఆదర్శ పాఠశాలలకు ఆయన కృషిచేశారు. దాతలను సహకారంతో బెంచీలు, సైన్స్ పరికరాలు, చార్టులు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేశారు. ఆయన సేవలను గుర్తించి 1994లో కల్చరల్ టాలెంట్ జాతీయ కోచ్‌గా ఎంపిక చేశారు. 2004లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. 2017లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.

జంకుతండాలో భూమి పంచాయితీ



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



అధికారులు, పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జంకుతండా గ్రామస్తులు

● గ్రామ పంచాయతీ భూమిలో పంచాయతీ భవన నిర్మాణానికి పూనుకున్న అధికారులు
● ముగ్గు పోస్తుండగా అడ్డుకున్న మహిళ
● ఆ స్థలం తమదేనంటూ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం జంకుతండాలో గ్రామపంచాయతీకి చెందిన భూమిలో పంచాయతీ భవనం నిర్మించేందుకు గాను సోమవారం ముగ్గు పోసేందుకు వెళ్లిన అధికారులను ఓ మహిళ అడ్డుకుంది. ఆ భూమి తమదేనని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వివరాలు.. నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన జంకుతండాలో పంచాయతీ భవనం నిర్మించేందుకు గ్రామ కంఠం భూమి లేకపోవడంతో సర్వే నంబర్ 45/2/1/2లో రెండున్నర గుంటలు, 45/2/3లో మరో రెండున్నర గుంటలు మొత్తం కలిపి ఐదు గుంటల భూమి గ్రామపంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండడంతో అందులో ముగ్గు పోసేందుకు సోమవారం అధికారులు వచ్చారు. జేసీబీతో అధికారులు ఆ స్థలాన్ని శుభ్రం చేయిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బాలాజీ, అతడి భార్య సరోజ ఆ స్థలం తమది అంటూ అధికారులను అడ్డుకున్నారు. తాము ఎన్నో సంవత్సరాలుగా ఆ స్థలంలో పెంట పోసుకుంటున్నామని, అధికార పార్టీ సర్పంచ్ ప్రోద్బలంతోనే ఈ భవన నిర్మాణం జరుగుతుందని ఆరోపించారు. ఆధారాలు చూపించాలని అధికారులు కోరడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ముగ్గు పోయడం ఆపకపోతే తాను చనిపోతానంటూ సరోజ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన మరికొంత మంది అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ముగ్గు పోసేందుకు వచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సరోజను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ హరిబాబును వివరణ కోరగా.. జంకుతండాలో పంచాయతీ భవనం నిర్మాణానికి గ్రామ కంఠం భూమి లేదని, దీంతో గ్రామ పంచాయతీకి ఇద్దరు దాతలు విరాళంగా ఇచ్చిన ఐదు గుంటల భూమిని సర్వే చేయించి అందులో భవనం నిర్మాణానికి ముగ్గు పోసినట్లు తెలిపారు. ఆందోళన చేసేవారిని ఆధారాలు చూపించమని అడిగితే వారి నుంచి ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఆర్డీఓ, కలెక్టర్‌కు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. జంకుతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కొంతమందిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపారు. ఘటనా స్థలం వద్ద మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, తహసీల్దార్ హరిబాబు, డివిజనల్ సర్వేయర్ బాలాజీ, పీఆర్ ఏఈ చిల్లంచర్ల ఆదినారాయణ, మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు, ఆర్ఐ శ్యాం తదితరులున్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

● రాజాపేట పీఏసీఎస్ వద్ద వర్షంలో నిరీక్షణ
● రెండు, మూడు బస్తాలతో సరిపెట్టిన అధికారులు



వర్షంలో యూరియా కోసం గుమిగూడిన రైతులు

రాజాపేట: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఎరువుల షాపులు, పీఏసీఎస్ కార్యాలయాల చుట్టూ తిరిగిపోతున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియా కొన్ని గంటల్లోనే అయిపతుంది. సోమవారం రాజాపేట మండల కేంద్రంలోని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి లారీ లోడ్ యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న రైతులు పీఏసీఎస్‌కు తరలివచ్చారు. వర్షంలో తడుస్తూ యూరియా తీసుకెళ్లారు. ఎరువుల డీలర్ల వద్ద యూరియా దొరకడం లేదని, పీఏసీఎస్ కేంద్రాల వద్ద కూడా ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోయారు.

ఇంకా 20 వేల బస్తాల యూరియా అవసరం..

పీఏసీఎస్‌కు సోమవారం 8వేల బస్తాల యూరియా రాగా రూ.270 చొప్పున ఒక్కో రైతుకు రెండు నుంచి మూడు బస్తాలు విక్రయించారు. మండలంలో ఇంకా 20 వేల బస్తాల వరకు యూరియా అవసరం ఉందని పీఏసీఎస్ సీఈఓ శేఖర్ తెలిపారు.

ఓరుగంటి రాములు మృతి బీజేపీకి తీరని లోటు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
● రాములు భౌతికకాయానికి నివాళులర్పించిన పలువురు నేతలు



బీజేపీ కార్యాలయంలో రాములు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఓరుగంటి రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: బీజేపీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రాములు మృతి పార్టీకి తీరని లోటని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వ్యక్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఓరుగంటి రాములు పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాములుతో తనకు 40 ఏళ్ల నుంచి సన్నిహితం ఉందన్నారు. రాములు రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను కలిచివేసిందన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి రామగిరిలోని ఓరుగంటి రాములు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఓరుగంటి రాములు వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదే విధంగా మాజీమంత్రి కుందూరు జానారెడ్డి బీజేపీ కార్యాలయానికి వచ్చి రాములు భౌతికకాయానికి నివాళులర్పించారు. తాను, ఓరుగంటి రాములు జనసంఘ్‌లో కలిసి పనిచేశామని గుర్తుచేశారు. అదే విధంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి.. రాములుకు నివాళులర్పించారు. వీరితో పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి, చింత సాంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బంగారు శృతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతెపాక సాంబయ్య, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

ఓరుగంటి రాములు అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఆయన కుమార్తె అమెరికా నుంచి రావడంతో సోమవారం దుప్పలపల్లి రోడ్డులోని ఓరుగంటి రాములు వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



రాములు మృతదేహంపై బీజేపీ జెండా కప్పుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి తదితరులు



ఓరుగంటి రాములు పాడె మోస్తున్న నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

కోర్టు ధిక్కరణ కేసులో ఎస్ఐకి జైలు శిక్ష

వేములపల్లి: హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన వేములపల్లి ఎస్ఐ దాచేపల్లి విజయ్‌కుమార్‌కి మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు దాసరి యాదగిరి, దాసరి శ్రీనివాసులుకు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 902లో 2.12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి ఆ అన్నదమ్ములిద్దరికి ఇతరులతో గొడవలు జరుగుతుండడంతో వారు గతంలో హైకోర్టును ఆదేశించారు. దీంతో హైకోర్టు అట్టి భూవివాదంలో పోలీసులు కాని, ఇతరులెవ్వరూ జోక్యం చేసుకోవద్దని అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో హౌస్ ఆఫీసర్‌గా పనిచేసిన దాచేపల్లి విజయ్‌కుమార్ హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. దాసరి యాదగిరి, దాసరి శ్రీనివాసులును ఇబ్బందులకు గురిచేస్తున్న వారితో చేతులు కలిపి తిరిగి యాదగిరి, శ్రీనివాస్ పైనే కేసులు నమోదు చేశాడు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ధిక్కరణ కింద ప్రస్తుతం వేములపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు రెండు నెలల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆ వెంటనే తీర్పు అమలును నాలుగు వారాలకు వాయిదా వేసింది.